నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

11 | హైదరాబాద్, శనివారం 9 మార్చి 2024 | HYDERABAD





**లక్ష దీపోత్సవం** ▶ శుక్రవారం రాత్రి సికింద్రాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ రామాలయంలో లక్ష దీపాలను వెలిగిస్తున్న భక్తులు

## ఇదేం.. అమానుషం

**పొట్టకూటి కోసం.. మృత్యువుతో పోరాటం**

- కోట్లు వెచ్చించి కొన్న యంత్రాలున్నా.. కూలీలతో శుభ్రం చేయిస్తున్న జీహెచ్ఎంసీ
- మొన్ననే ముగ్గురు కూలీలు మృతి చెందినా.. మారని అధికారులు
- వర్షపు నీటిలైన్‌కు మురుగునీటి లైన్.. అనుసంధానంలో మతలబేమిటో.?

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : ఒక వ్యక్తి మురుగులోకి దిగి మరో వ్యక్తి శుభ్రం చేయడమంటే అది అనాగరికం! మరి.. విశ్వ నగరం అని కీర్తిం చుకుంటున్న హైదరాబాద్ మహానగరం నడిబొడ్డున నాగరిక ప్రపంచంలో ఈ అనాగరిక దృశ్యం అందరినీ కలిచివేసింది. రెండు రోజుల కిందట నగరంలోని గోల్నాక ప్రాంతంలో మ్యాన్‌హోల్‌లోకి దిగి కూలీలు డ్రైనేజీని శుభ్రం చేస్తూ కనిపించిన దృశ్యమిది. బాధ్యత కలిగిన ఒక పౌరుడు స్పందించి ఫొటోలు తీసి 'నమస్తే తెలంగాణ'కు అందించారు. జీహెచ్ఎంసీ అధికారులు ఈ కూలీలకు రోజుకు రూ.1100 (జంటకు... మగవారికి రూ.600, ఆడవారికి రూ.500) ఇచ్చి శుభ్రం చేయిస్తున్నారు. వాస్తవానికి ఇది వాన నీటి ప్రవాహం కోసం నిర్మించిన పైప్‌లైన్ (రెయిన్ వాటర్ పైప్‌లైన్). ఇందులో కేవలం వర్షపు నీళ్లు మాత్రమే పారాలి. కానీ అందుకు విరుద్ధంగా అధికారులు మురుగు నీటిని (డ్రైనేజీ లైన్) అనుసంధానం చేశారు. అందుకే మ్యాన్‌హోళ్లను శుభ్రం చేస్తున్న సమయంలో అటుగా వెళ్లే పాదాచారులు దుర్గంధంతో ముక్కు మూసుకొని వెళ్తున్నారు. అయితే ఈ రహదారిలో అసలు మురుగునీటి వ్యవస్థ ఎందుకు లేదు? వాన నీటి కోసం నిర్మించిన వ్యవస్థలో మురుగునీరు ఎందుకు వస్తుంది? జలమండలి మురుగునీటి వ్యవస్థను నిర్వహిస్తుండగా.. ఇక్కడ ఆ బాధ్యతను జీహెచ్ఎంసీ ఎందుకు చేపడుతుంది? ఇవన్నీ సందేహాలు ఒక ఎత్తయితే... కోట్లాది రూపాయలు వెచ్చించి నగరంలో ఎయిర్‌టెక్ యంత్రాలను కొనుగోలు చేయడం, అద్దెకు తీసుకుంటున్న ప్రభుత్వ విభాగాలు.. అసలు మురుగులోకి దింపి వ్యక్తులతో శుభ్రం చేయించడం సభ్య సమాజానికి సిగ్గు చేటు! ఇక్కడ ఇంకో విషయం... కొన్నిరోజుల కిందటే జియాగూడలో ఓ డ్రైనేజీ లైన్ అనుసంధానం కోసం మ్యాన్‌హోల్‌లో దిగిన ముగ్గురు కూలీలు మృత్యువాత పడిన ఘోరకలి మదిలో మెదులుతుండగానే ఈ దృశ్యాలు కనిపించాయి.



▶ రామలింగేశ్వర స్వామి కల్యాణానికి పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

## శివోత్సవం..

శివ నామస్మరణతో మారుమోగిన శైవక్షేత్రాలు

'హరహర మహాదేవ.. శంభో శంకర' అంటూ సాగిన శివనామస్మరణతో మహానగరంలోని శైవ క్షేత్రాలు మారుమోగాయి. శుక్రవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల ఎదుట భక్తులు బారులు తీరి పరమశివుడిని దర్శించుకుని పునీతులయ్యారు. కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. స్వామివారికి వేదపండితులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు, రుద్రస్వాహకార హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.



# కేసీఆర్ చేసిండు.. రేవంత్ ప్రారంభిస్తుండు

- నల్లచెరువు, పెద్ద చెరువు ఎస్టీపీలు..
- బైరామల్‌గూడ రెండవ లెవల్ ఫ్లై ఓవర్, లూప్ వంతెన పనులు పూర్తి

**బీఆర్ఎస్ ఘనతే**

- నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి





### గత ప్రభుత్వ ఫలాలు.. ఒక్కొక్కటిగా అందుబాటులోకి

- వంద శాతం మురుగునీటి శుద్ధికి కేసీఆర్ ప్రభుత్వం అంకురార్పణ
- అసెంబ్లీ ఎన్నికల ముందు రెండు ఎస్టీపీలు అందుబాటులోకి

రూ.**3866.41** కోట్ల వ్యయంతో..

**1259.50** ఎంఎల్‌డీ సామర్థ్యంతో..

**31** కొత్త ఎస్టీపీల నిర్మాణం

సిటీబ్యూరో, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో మురుగునీటి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టింది. రోజూ ఉత్పన్నమయ్యే మురుగునీటిని వంద శాతం శుద్ధి చేయడానికి వీలుగా ఎస్టీపీ (సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టులో భాగంగా మూడు ప్యాకేజీల్లో మొత్తం రూ.3866.41 కోట్ల వ్యయంతో 1259.50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో 31 కొత్త ఎస్టీపీలను నిర్మించతలపెట్టగా.. వీటి నిర్మాణ బాధ్యతను జలమండలి చూస్తున్నది. ఐదు సర్కిళ్లలో ఆధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో ఈ కొత్త ఎస్టీపీల నిర్మాణం జరుగుతున్నది.

### నేడు నల్లచెరువు, పెద్ద చెరువు ఎస్టీపీలు ప్రారంభం

31 ఎస్టీపీల్లో గత అసెంబ్లీ ఎన్నికల ముందే కోకాపేట, దుర్గం చెరువు ఎస్టీపీలను అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు పనులన్ని తుది దశకు చేరగా, నిర్మాణ పనులు పూర్తి చేసుకొని ట్రయల్ రన్ పనులు విజయవంతం చేసుకున్న నల్లచెరువు, పెద్ద చెరువు ఎస్టీపీలను కాంగ్రెస్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తున్నది. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ఈ రెండు ఎస్టీపీలను ప్రారంభించనున్నారు. ప్రాజెక్టు పూర్తి ఫలాలు అందుబాటులోకి వస్తే రోజు ఉత్పన్నమయ్యే మురుగును 100శాతం శుద్ధి చేసే తొలి నగరంగా దక్షిణాసియాలోనే హైదరాబాద్ చరిత్ర సృష్టిస్తుంది. కాగా ప్రస్తుతం గ్రేటర్‌లో ప్రతి రోజు 1950 ఎంఎల్‌డీల మురుగునీరు ఉత్పన్నమవుతున్నది. జీహెచ్ఎంసీ ప్రాంతంలో 1650 ఎంఎల్‌డీ, ఇప్పటికే 25 ఎస్టీపీల ద్వారా 772 ఎంఎల్‌డీ నీటిని (46శాతం) శుద్ధి చేసి మూసీలోకి వదులుతున్నారు. ఇది దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే అధికం.

### నల్లచెరువు ఎస్టీపీ వివరాలు

హైదరాబాద్ నగరంలో సీవరేజీ మాస్టర్‌ప్లాన్, ఎస్టీపీల ప్రాజెక్టు ప్యాకేజీ-1లో భాగంగా నల్లచెరువు ఎస్టీపీని నిర్మించారు.

నిర్మాణ వ్యయం -రూ. **119.80** కోట్లు | సామర్థ్యం - **86.5** ఎంఎల్‌డీలు

### ప్రయోజనం పొందే ప్రాంతాలు :-

నాచారం, కంటోన్మెంట్, కాప్రా, బాబానగర్, ఈఎస్ఐ, హెచ్ఎంటీ, హైకోర్టు కాలనీ, సేశాయి నగర్, ద్వారకా నగర్, కమలానగర్, పాత స్వరూప్‌నగర్, ఓల్డ్ రామంతాపూర్, ప్రేమ్ నగర్, పటేల్ నగర్, అజాద్ నగర్, కల్యాణ్ నగర్, కేసీఆర్ కాలనీ, కేటీఆర్ కాలనీ, మినీ శిల్పారామం, ఉప్పల్ భగాయత్, ఆదిత్య హాస్పిటల్, రామంతాపూర్, ఐడీఐ ఉప్పల్, ఉప్పల్ స్టేడియం, మోడర్న్ బేకరీ రోడ్డు, ఉప్పల్, హబ్సిగూడ, శ్రీనివాస్ కాలనీ, విజయపురి కాలనీ

### కలిగే ప్రయోజనాలు.. :-

ఎస్టీపీ పరిధిలోని ప్రాంతంలో మురుగునీరు శుద్ధి అవుతుంది. క్యాచ్‌మెంట్ ఏరియాలోకి సీవరేజీ నీరు ప్రవాహం తగ్గుతుంది. శుద్ధి చేసిన నీటిని చెరువులు, కుంటల్లోకి విడుదల చేయడం వల్ల అవి కాలుష్యం కావు. శుద్ధి చేసిన నీటిని భవన నిర్మాణాలు, గార్డెనింగ్ లాంటి మానవేతర అవసరాలకు వాడుకోవచ్చు.

### పెద్ద చెరువు ఎస్టీపీ వివరాలు

నిర్మాణ వ్యయం -రూ. **45.67** కోట్లు | సామర్థ్యం - **17.50** ఎంఎల్‌డీలు

నాచారం, తార్నాక, మల్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి నాలా ద్వారా వచ్చే మురుగునీరు శుద్ధి అవుతుంది. గౌతంనగర్, లాలాగూడ, దయానంద్‌నగర్, సంజీవ్‌నగర్, తార్నాక, హబ్సిగూడ, శ్రీనివాస కాలనీ, చిలుకానగర్ తదితర ప్రాంతాలకు మురుగునీటి సమస్య తీరనున్నది.

## మహానగరంలో.. మరో వంతెన

- ప్రజలకు అందుబాటులోకి వస్తున్న కేసీఆర్ ప్రభుత్వ వ్యూహాత్మక ప్రగతి
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రేటర్ వాసులు

మహానగరాభివృద్ధికి 'వ్యూహాత్మక' అడుగులు ఫలితాలిస్తున్నాయి. ఏండ్ల తరబడి ట్రాఫిక్ కష్టాలతో సతమతవుతున్న పౌరులకు ఉపశమనం కల్పించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం' (ఎస్ఆర్‌డీపీ) ప్రారంభించింది. ప్రధాన జంక్షన్ల వద్ద వెతలు తీర్చేందుకు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణంతో పాటు రహదారుల విస్తరణ పనులు చేపట్టారు. మొత్తం 42 పనులకు శ్రీకారం చుట్టగా.. ఎన్నికలకు ముందే 33 పనులు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో శరవేగంగా చేట్టిన 34వ ఫ్లైఓవర్‌ను శనివారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

ఎల్బీనగర్, మార్చి 8 : గ్రేటర్ హైదరాబాద్ మహానగరంలో మరో అద్భుతం అవిష్కృతం కానున్నది. ఎస్ఆర్‌డీపీ ( స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్)లో భాగంగా బైరామల్‌గూడలో రెండవ లేవల్ ఫ్లై ఓవర్‌తో పాటు లూప్ ఫ్లై ఓవర్ ప్రజలకు అందుబాటులోకి రానున్నది. హైదరాబాద్ మహానగరంలో రహదారుల విస్తరణ, ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపే క్రమంలో భాగంగా కేసీఆర్ ప్రభుత్వ సంకల్పంతో రూపుదిద్దుకున్న ఎస్ఆర్‌డీపీ పనుల్లో మరో ముందడుగు పడింది. ఎల్బీనగర్‌లో ఇప్పటికే ఎల్‌బీనగర్, బైరామల్‌గూడ, కామినేని, నాగోలు ప్రాంతాల్లో ఫ్లై ఓవర్లు పూర్తి కాగా.. చింతలకుంట, ఎల్బీనగర్‌లో అండర్‌పాస్‌లు కూడా ప్రస్తుతం అందుబాటులోకి వచ్చి ట్రాఫిక్ రద్దీ దాదాపుగా తీరిపోయింది. అయితే ఇన్నర్ రింగ్‌రోడ్డు నుంచి సాగర్ రోడ్డుతో పాటుగా చింతలకుంట అండర్‌పాస్ మీదుగా విజయవాడ జాతీయ రహదారిని కలిపే విధంగా వై ఆకారంలో నిర్మించిన రెండవ లేవల్ ఫ్లై ఓవర్ పనులు పూర్తికాగా ప్రారంభానికి సిద్ధమైంది. ఈ ఫ్లై ఓవర్‌తో పాటుగా బైరామల్‌గూడ లూప్ ఫ్లైఓవర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించనున్నారు.

### 34వ ఫ్లై ఓవర్


బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రేటర్ హైదరాబాద్ మహానగరంలో ఎస్ఆర్‌డీపీ పనుల్లో భాగంగా 42 పనులకు శ్రీకారం చుట్టారు. వీటిలో ప్రస్తుతం బైరామల్‌గూడ రెండవ లేవల్ ఫ్లైఓవర్ 34వది. గత కేసీఆర్ ప్రభుత్వ హాయంలో యుద్ధ ప్రాతిపదికన ఈ ఫ్లై ఓవర్లకు శ్రీకారం చుట్టారు. మిగిలిన ఫ్లై ఓవర్లను కూడా ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. ఈ రెండవ లేవల్ ఫ్లై ఓవర్ పూర్తి కావడంతో ఇన్నర్ రింగ్‌రోడ్డుతో పాటుగా సాగర్ రోడ్డు, చింతలకుంట వైపు మార్గాల్లో ట్రాఫిక్ చిక్కులకు పూర్తిగా పరిష్కారం లభించనున్నది.

### రూ. 148.05 కోట్ల వ్యయంతో..

బైరామల్‌గూడ జంక్షన్‌లో రెండవ లేవల్ ఫ్లై ఓవర్, కుడి వైపు లూప్ ఫ్లై ఓవర్ నిర్మాణం రూ.148.05 కోట్లతో చేపట్టారు. మొత్తం పొడవు 1786.60 మీటర్లు చేపట్టారు. వయాడక్ట్ భాగం పొడవు 1305.60 మీటర్లు, ర్యాంపుల పొడవు 481 మీటర్లు ఉంది. ఫ్లై ఓవర్ ఒక వైపు ర్యాంప్పు ఎ -143 మీటర్లు, చింతలకుంట వైపు ర్యాపు-బి 212 మీటర్లు , నాగార్జున సాగర్ రోడ్డు వైపు ర్యాంపు- సీ 126 మీటర్లు ఉంది. ఒవైసీ వైపు 12 మీటర్ల వెడల్పు , 11 మీటర్ల క్యారేజ్ వే, 3 లేన్ వన్ వే ఉండగా, నాగార్జున సాగర్ వైపు 8.5 మీటర్ల వెడల్పు 7.5 మీటర్ల క్యారేజ్ వే, 2 లేన్ వన్‌వే, చింతల కుంట వైపు 8.5 మీటర్ల వెడల్పు, 7.5 మీటర్ల క్యారేజ్ వే, 2 లేన్ వన్‌వే తో ఫ్లై ఓవర్ నిర్మించారు.


### తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

బైరామల్‌గూడ జంక్షన్‌లో రెండవ లేవల్ ఫ్లై ఓవర్ నిర్మాణంతో దక్షిణ, తూర్పు హైదరాబాద్ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతున్నది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి సికింద్రాబాద్ ప్రాంతంతో పాటుగా నల్గొండ, వరంగల్ ప్రాంతాలకు కూడా మెరుగైన సదుపాయం కలుగుతుంది.



మురుగునీటి శుద్ధి కోసం దుర్గంచెరువు వద్ద బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్

## యథావిధిగా నీటి సరఫరా



సిటీబ్యూరో, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరానికి మంచినీటిని సరఫరా చేస్తున్న ఉస్మాన్‌సాగర్ జలాశయం కాండూట్ (నీటి కాలువ)కు హకీంపేట్ ఎంఈఎస్ వద్ద ఏర్పడిన భారీ నీటి లీకేజీని అరికట్టడానికి శనివారం ఉదయం 6 నుంచి అర్ధరాత్రి వరకు 18 గంటల వరకు మరమ్మతు పనులు నిర్వహించాలని జలమండలి తొలుత నిర్ణయించింది. ఐతే ఈ పనులను కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు శుక్రవారం అధికారులు ప్రకటించారు. నగరంలో అన్ని ప్రాంతాల్లో మంచినీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.



ఉస్మానియా దవాఖానను పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిశోర్, హెచ్ఎండీఏ జేసీఎం ఆమ్రపాలి, తదితరులు

## ఉస్మానియాకు ప్రిన్సిపల్ సెక్రటరీ

సుల్తాన్ బజార్, మార్చి 8: ఉస్మానియా దవాఖానను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిశోర్, హెచ్ఎండీఏ జేసీఎం ఆమ్రపాలి, సీఎం ఓఎస్‌డీ బి.అజిత్ రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.నాగేందర్, అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి తదితర అధికారులతో కలిసి పరిశీలించారు. పాత భవనం ప్రస్తుత పరిస్థితి, భవనానికి సంబంధించిన పలు నివేదికలు, కోర్టు సమస్యలపై సూపరింటెండెంట్ బి.నాగేందర్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ అడ్మిన్ డాక్టర్ శేషాద్రి, ఆర్ఎంఓలు సాయిశోభ, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ కవిత, డాక్టర్ సుష్మ, డాక్టర్ జాఫర్ హష్మి, డాక్టర్ రఫి తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకుల పాఠశాల కళాశాల భవనం ప్రారంభం

మెహిదీపట్నం, మార్చి 8 : కార్వాన్ నియోజకవర్గం పరిధిలోని ఇబ్రహీంబాగ్‌లో తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాల, పాఠశాల భవనాన్ని శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, రాజ్యసభ సభ్యుడు మందడి అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీతో కలిసి ప్రారంభించిన అనంతరం భవనంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినొద్దీన్, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, టెమ్రిస్ సెక్రటరి అయేషా నుస్రత్ జహ, తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంబాగ్‌లో తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాల, పాఠశాల భవనాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి,